క్లుప్తంగా

'నీరు - మీరు' అంశంపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

బాడంగి: ప్రతి నెలా మూడో శనివారం నిర్వహిస్తున్న 'స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర'లో భాగంగా ఈ వారం 'నీరు – మీరు' అంశంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. నీటిని సక్రమంగా వినియోగించుకునేలా ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. నీటిని పరిరక్షించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

జాగ్రత్తలు తప్పనిసరి

బాడంగి: రైతులకు నష్టం వాటిల్లకుండా ఎరువుల డీలర్లు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి జి.సూర్యప్రకాష్ అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ శాఖా కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎరువులు, పురుగు మందులు విక్రయించినప్పుడు తప్పనిసరిగా బిల్లులు అందజేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు స్టాక్ వివరాలు, అమ్మకాలు, ధరల వివరాలను బోర్డులో ప్రదర్శించాలన్నారు. సమావేశంలో ఏఈఓ సునీత, వీఏఏలు శరత్, రాంబాబు, జయలక్ష్మి, సాయి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బొద్దూరులో యోగా సన్నాహక ర్యాలీ



బొద్దూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

సంతకవిటి: మండలంలోని బొద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం యోగా సన్నాహక ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా 'యోగ సాధన చేయండి – ఆరోగ్యం పొందండి' అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం గోపాలరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



హరి రమణారావు

వంగర: మండల తహసీల్దార్‌గా హరి రమణారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన దిరిశాల ధర్మరాజు బదిలీపై చీపురుపల్లి తహసీల్దార్‌గా వెళ్లగా.. ఇదే కార్యాలయంలో డీటీగా పనిచేస్తున్న హరి రమణరావుకు పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రైతులు, యువత, విద్యార్థులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందజేస్తామని, ఎటువంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని, రెవెన్యూ వ్యవస్థను గాడిలో పెడతామని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలంటూ బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

రాజాం సిటీ: తమ సమస్యలు పరిష్కరించాలంటూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. 45 రోజులుగా నిరసన తెలుపుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా ఈ నెల 22 అర్ధరాత్రి నుంచి నిరవధిక సమ్మె చేయనున్నామని, పట్టణ వాసులంతా సహకరించాలని కోరారు. సంవత్సరంలో వచ్చే ఆదివారాలు, దేశ, జాతీయ, రాష్ట్ర సెలవులు మొత్తం 72 రోజులు వేతనంతో కూడిన సెలవులుగా ప్రకటించాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, కార్మికులకు సంక్షేమ పథకాలు అందజేయాలని, టెక్నికల్స్‌కు రూ. 29,200, నాన్ టెక్నికల్స్‌కు రూ. 24,500 జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘ గౌరవాధ్యక్షుడు సీహెచ్ రామ్మూర్తి నాయుడు, హరిబాబు, అనిల్‌కుమార్, మరియదాసు, కృష్ణ, గణపతి, రామకృష్ణ, ప్రసన్నలక్ష్మి, సత్యనారాయణ, సోమేష్, తదితరులు పాల్గొన్నారు.

మెట్టమగ్గూరులో వైద్యశిబిరం

వంగర: మండల పరిధి మెట్టమగ్గూరులోని శ్రీసూర్యా మెడికల్ సెంటర్‌లో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. విజయనగరానికి చెందిన శ్రీసాయి సూపర్‌స్పెషాలిటీ వైద్యుడు శ్రీరామ్మూర్తి సౌజన్యంతో నిర్వహించిన శిబిరంలో సుమారు 150 మంది రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు ఉగిరి ముత్యాలరావు, పీఆర్‌టీ సింహాచలం, జ్యోతి, కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య యోగం..



యోగాసనాల్లో ఖండ్యాం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

- యోగాతో శారీరక, మానసిక వికాసం
- ప్రపంచ దేశాలకు విస్తరిస్తున్న యోగా
- నేడు అంతర్జాతీయ యోగా డే

రాజాం:

పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ ఉరుకులు, పరుగులు తీయాల్సి రావడంతో ఒత్తిడి అధికమవుతోంది. దీంతో మానసిక ప్రశాంతత కరువవ్వడంతో పాటు శారీరక ఇబ్బందులు కూడా ఎదురవుతున్నాయి. అలాగే లేనిపోని వ్యాధులు ప్రబలి ఆయుష్షు క్షీణిస్తోంది. ఇలాంటి సమయంలో యోగా రక్షణ కవచంలా పనిచేస్తోంది. చిన్నపాటి రోగానికి సైతం పాశ్చాత్య మందులు, వైద్యాన్ని వినియోగిస్తున్న ఈ తరుణంలో యోగాతో ఎన్నో సమస్యలు పరిష్కరించవచ్చునని శాస్త్రీయంగా నిపుణులు నిరూపిస్తున్నారు. ఫలితంగా భారత్‌తో పాటు ప్రపంచ దేశాల్లో యోగాపై ఆసక్తి పెరిగింది. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకూ యోగాసనాలు వేసి తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. నేడు ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.



యోగాసనాలు వేస్తున్న మహిళలు

11 ఏళ్లుగా..

ప్రపంచ వ్యాప్తంగా యోగా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జూన్ 21న జరుపుతున్నారు. మానసిక, శారీరక ఆరోగ్యానికి దోహదపడేదిగా యోగాకు ప్రత్యేక గుర్తింపు లభించింది. భారత్‌లో అత్యంత పురాతన కాలం నుంచి యోగా ఆచరణలో ఉంది. 2014 సెప్టెంబర్ 27న ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జూన్ 21న జరుపుకోవాలని ప్రధాని నరేంద్రమోదీ ప్రతిపాదించారు. ఈ తీర్మానానికి 193 ఐరాస ప్రతినిధులలో 177 సభ్యదేశాలు మద్దతు తెలిపాయి. 2015 జూన్ 21న ప్రపంచవ్యాప్తంగా తొలి అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. దేశంతో పాటు న్యూయార్క్, పారిస్, బీజింగ్, బ్యాంకాక్, కౌలాలంపూర్, సియోల్ వంటి దేశాల్లో కూడా యోగా దినోత్సవం నిర్వహిస్తున్నారు.

ఎంతో కొంత చాలు.

యోగాసనాలు చాలా ఎక్కువ ఉన్నాయి. అన్ని ఆసనాలు వేయాల్సిన అవసరం లేదు. చిన్నారులు, వృద్ధుల దగ్గర నుంచి ప్రతి ఒక్కరూ సులభంగా కొన్ని రకాల ఆసనాలు వేసి మంచి ఫలితాలు సాధించవచ్చు. మంచి వెలుతురు, గాలి ఉన్న ప్రదేశంలో ఆసనాలు వేయడం ద్వారా తేజస్సు, శక్తి, మానసిక, శారీరక వికాసాన్ని పొందవచ్చును. యోగాసనాల్లో సూర్య నమస్కారాలు, శశాంక ఆసనం, వక్రాసనం, వజ్రాసనం, పద్మాసనం, సుప్తవజ్రాసనం, నటరాజాసనం, వృక్షాసనం, అర్ధచక్రాసనం, సేతుబంధాసనం, బద్ధకోన ఆసనం వంటివి ప్రతి ఒక్కరూ వేయవచ్చునని నిపుణులు వెల్లడిస్తున్నారు.

వికాసతరంగిణి ఆధ్వర్యంలో..

రాజాంలోని వికాసతరంగిణి ఆధ్వర్యంలో యోగా తరగతులు జరుగుతున్నాయి. రాజాంతో పాటు పరిసర గ్రామాల ప్రజల కోరిక మేరకు ఆయా గ్రామాల్లో 20 నుంచి 30 రోజుల పాటు యోగాపై శిక్షణ ఇస్తున్నారు. వికాసతరంగిణి రాష్ట్ర సంస్కార్ అధ్యక్షుడు టీటీవీ రమణమూర్తి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలు పదేళ్లుగా రాజాంలో జరుగుతున్నాయి.

మంచి ఆరోగ్యం



యోగాతో మంచి మానసిక ఆరోగ్యం సాధ్యం. ఆసనాలు వేయడం వల్ల ఆరోగ్యకర జీవనం అలవడుతుంది. సీజనల్ వ్యాధులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులు దరి చేరవు. యోగా చేసిన వారికి శారీరక వికాసంతో పాటు మానసిక వికాసం కలుగుతుంది. ఒత్తిడిని సైతం అధిగమించవచ్చు.

– డాక్టర్ ఎస్.సునీల్‌కుమార్, ప్రభుత్వ ఆయుష్ వైద్యకేంద్రం అధికారి, ఖండ్యాం, రేగిడి మండలం

విద్యార్థులకు ఎంతో ఉపయోగం



విద్యార్థులకు యోగా ఎంతో ఉపయోగపడుతోంది. జ్ఞాపకశక్తి బాగా పెరుగుతుంది. మా పాఠశాలల్లో వారంలో ఒకరోజు యోగా తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా యోగాలో పాల్గొంటున్నారు. శారీరక వికాసానికి ఎంతో దోహదపడుతుంది.

– తాలాడ దుర్గయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు, జెడ్పీ హైస్కూల్, కంచరాం, రాజాం మండలం.

అవగాహన కార్యక్రమాలు



రేగిడి : ఖండ్యాం ఉన్నత పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న అభ్యాసకులు

రేగిడి: మండలంలోని పలు గ్రామాల్లో అంతర్జాతీయ యోగా అవగాహనా కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఖండ్యాం, సంకిలి, కందిశ, తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు యోగాపై అవగాహనా కార్యక్రమాలు, గ్రామాల్లో ర్యాలీలు చేపట్టారు. కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల హెచ్ఎంలతో పాటు ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు, ఖండ్యాం ఆయుర్వేద వైద్యాధికారి ఎం.సునీల్‌కుమార్, యోగా ఇన్‌స్ట్రక్టర్ రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు కింజరాపు సురేష్‌కుమార్, రేగిడి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గులివి జగ్గునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాలకు న్యాయం చేసిన వ్యక్తి జగనన్నే..



పుస్తకావిష్కరణ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ నాయకులు
- 'జగన్ అంటే నమ్మకం – చంద్రబాబు అంటే మోసం' పుస్తకావిష్కరణ

బాడంగి: తన పాలనలో అన్ని వర్గాలకు న్యాయం చేసి ప్రజల హృదయాల్లో చోటు సంపాదించుకున్న వ్యక్తి జగన్ మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ' జగన్ అంటే నమ్మకం – చంద్రబాబు అంటే మోసం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు యామలి శివప్రసాద్, తదితరులు మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చేందుకు ఎన్నికల ముందు సూపర్ 6 పథకాలు ఇస్తానంటూ ప్రజలకు హామీలిచ్చి అనంతరం మాట మార్చిన నాయకుడు చంద్రబాబు అని మండిపడ్డారు. దీపం పథకం, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను మొదటి ఏడాది ఎగ్గొట్టి.. ఇప్పుడు రెండో ఏడాదిలో కూడా వేలాది మంది తల్లులను అనర్హులుగా తప్పించి అన్ని వర్గాలను మోసం చేశారని ఆరోపించారు. అన్నదాత సుఖీభవ ఊసేలేదు.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం లేదు.. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి పథకాలకు అతీగతీ లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రజలే ముఖ్యం కాగా.. కూటమి ప్రభుత్వం కార్యకర్తలు, నాయకులకే ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు కె.సూర్యనారాయణరాజు, జిల్లా కమిటీ మెంబర్ ఆవు సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, జేసీఎస్ కన్వీనర్ ఎం.శంకరరావు, నాయకులు బి. రమేష్, బి.శంకరరావు, టి.తిరుపతిరావు, టి. రామినాయుడు, కె.భాస్కరరావు, రెడ్డి కృష్ణ, సురేష్, స్వామినాయుడు, టి.శ్రీనివాసరావు, మరడ రమణ, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విజయవంతం చేయండి



ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌కు సమ్మె నోటీసు అందిస్తున్న అంగన్వాడీ యూనియన్ సభ్యులు

రాజాం సిటీ: సమస్యల పరిష్కారానికి జూలై 9న దేశవ్యాప్త అఖిల భారత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక సంఘాల ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి సీహెచ్ రామ్మూర్తినాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రజనీదుర్గకు కార్యకర్తలతో కలసి సమ్మె నోటీస్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సిబ్బందికి కనీస వేతనం రూ. 26 వేలు చేయడంతో పాటు ఉద్యోగభద్రత కల్పించాలని, లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పి.ఉమా, ఉమాకుమారి, పుణ్యవతి, లక్ష్మీనారాయణ, కాశీరత్నం, శ్రీదేవి, పార్వతి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం..



రేగిడి మండలంలోని మజ్జిరాముడుపేట అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. పది మంది చిన్నారులచే అక్షరాలు దిద్దించి, గణపతి పూజలు చేపట్టారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త పద్మావతి, గ్రామ పురోహితుడు కిన్నెరకాంత అన్నారావు, గ్రామస్తులు పాల్గొన్నారు. – రేగిడి

ఘనంగా రెవెన్యూ డే



కేక్ కట్ చేస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ ప్రకాష్, తదితరులు

రాజాం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ తహసీల్దార్ బి.ప్రకాష్‌తో పాటు సీఎస్‌డీటీ చిరంజీవి, వీఆర్‌ఓ ఉద్యోగుల సంఘ నాయకుడు అబ్బాస్, తదితరులు కేక్ కట్ చేసి వేడుకలు చేపట్టారు. రెవెన్యూ వ్యవస్థ ద్వారానే సామాజిక అభివృద్ధి, భూ రక్షణ చట్టాల అమలు సాధ్యమని, ఈ వ్యవస్థను ప్రభుత్వం మరింత బలోపేతం చేయాలని ఈ సందర్భంగా వక్తలు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పలువురు వీఆర్‌ఓలు, కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అత్యుత్తమ సేవలే సంతృప్తినిస్తాయి.

బొబ్బిలిరూరల్: ప్రజలకు అధికార, సిబ్బంది అందించే అత్యుత్తమ సేవలే సంతృప్తినిస్తాయని హెచ్‌డీటీ సుబ్బారావు అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ గౌరీశంకర్, ఆర్ఐ రామకుమార్, సీఎస్‌డీటీ సాయికృష్ణ, శివున్నాయుడు, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి..

తెర్లాం: రెవెన్యూ శాఖ అందిస్తున్న సేవలను ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల ఉప తహసీల్దార్ జి.సత్యనారాయణ, ఎంపీడీఓ రేగి రాంబాబు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలు, రైతులకు ఎల్లప్పుడు సేవలందించడంలో రెవెన్యూ శాఖ ప్రథమంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణమూర్తి, మండల సర్వేయర్ అప్పలనాయుడు, ఎంఈఓ త్రినాథరావు, రీసర్వే ఉప తహసీల్దార్ రవికిరణ్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

దరఖాస్తుల ఆహ్వానం

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో వివిధ ట్రేడుల్లో మిగులు సీట్లకు రెండో విడతలో భాగంగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి. భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు జూలై 15 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 17న సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని తెలిపారు. 21న జరగనున్న కౌన్సెలింగ్‌కు 10వ తరగతి ఒరిజినల్, స్టడీ సర్టిఫికెట్, కుల, ఆదాయ, ఆధార్ వంటి ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 90000 96048, 83094 38446, 99595 02238 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఐటీఐలో..

బొబ్బిలి: ప్రభుత్వ ఐటీఐలో చేరేందుకు రెండో విడత అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పీవీ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19 నుంచి వచ్చే నెల 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, వచ్చే యునిక్ కోడ్ భద్రపరుచుకోవాలని సూచించారు. అలాగే ఈ నెల 23,24 తేదీల్లో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఐటీఐ, ఇంటర్, బీఏ, బీకాం, బీఎస్సీ(కెమిస్ట్రీ) కోర్సులు చేసిన వారు అర్హులన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

రేగిడి: మండలంలోని ఆమదాలవలస కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. రాగోలు జెమ్స్ ఆస్పత్రి వైద్యులు ఎస్.పవన్‌సాయి, వై. అప్పలకొండ, కె.దీప విద్యార్థులను పరీక్షించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. ఎంఈఓలు ఎంవీ ప్రసాదరావు, బి.ఎరకయ్య, హెచ్ఎం రమేష్ కుమార్, ఎస్.రమాదేవి పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి..

బొబ్బిలి: కర్నూల్ జిల్లా ఆదోని బీజేపీ ఎమ్మెల్యే ఓ అధికార కార్యక్రమంలో అక్కడి దళిత సర్పంచ్ చంద్రశేఖర్‌ను స్టేజ్‌పైకి పిలవకుండా కాళ్ల వద్ద నిలబెట్టి అవమానించడం దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పొట్నూరు శంకరరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం గేటు వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఎం. ప్రసాద్, జి. గౌరి పాల్గొన్నారు.

కొత్త రహదారి నిర్మించండి

బొబ్బిలి: పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి దాడితల్లి అమ్మవారి ఆలయం వరకు ఉన్న బైపాస్ రహదారిని కొత్తగా నిర్మించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మువ్వల వెంకటరమణ అన్నారు. ఈ మేరకు శుక్రవారం రహదారిని ఆయన పరిశీలించారు. రహదారి వేయకుండా మళ్లీ మరమ్మతులు చేపడతామని ఎమ్మెల్యే బేబినాయన అనడం విడ్డూరంగా ఉందన్నారు. తమ పార్టీ వారికి కాంట్రాక్ట్ ఇవ్వడానికి మరమ్మతులు చేస్తామని ఎమ్మెల్యే చెబుతున్నారని, ఇలా ఎన్నిసార్లు మరమ్మతులు చేస్తారని ప్రశ్నించారు. ఎన్నిసార్లు మరమ్మతులు చేపట్టినా ఫలితం ఉండదని.. కొత్త రహదారి వేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థుల సంఖ్య పెంచే బాధ్యత హెచ్ఎంలదే..

- ఎంఈఓ తిరుమల ప్రసాద్



మాట్లాడుతున్న ఎంఈఓ తిరుమలప్రసాద్

రామభద్రపురం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచే బాధ్యత ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులదేనని ఎంఈఓ తిరుమలప్రసాద్ స్పష్టం చేశారు. ఎంఈఓ -2 పెంటయ్యతో కలిసి శుక్రవారం స్థానిక ఎంఆర్‌సీ భవనంలో హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా గుర్తించిన వాటిలో విద్యార్థుల సంఖ్య వంద దాటేలా చూడాలని.. లేదంటే మళ్లీ బేసిక్ ప్రైమరీ స్కూళ్లుగా మార్చే అవకాశం ఉందన్నారు. ప్రతిరోజూ పాఠశాలలో ఉదయం 9.30 గంటలకే టీచర్ హాజరుతో పాటు విద్యార్థుల హాజరు లీప్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఎస్‌ఈఆర్‌టీ విడుదల చేసిన అకడమిక్ క్యాలెండర్ ప్రకారం తరగతుల నిర్వహణ జరగాలన్నారు. సకాలంలో సిలబస్‌ను పూర్తయ్యేలా ప్రణాళికలు వేసుకోవాలని సూచించారు. అలాగే విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పెరిగేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ రాజేశ్వరి

బాడంగి: మండలంలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగులకు ఉపకరణాలను మండల విద్యాశాఖాధికారి రాజేశ్వరి చేతుల మీదుగా పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ట్రై సైకిళ్లు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా స్పెషల్ ఎడ్యుకేటర్ కొల్లి ఈశ్వరరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం దివ్యాంగులకు ఎస్కార్ట్, రవాణా భత్యం, రీడర్ అలవెన్స్‌లు, బాలికలకు స్టైఫండ్, ఉపకరణాలు, ఫిజియోథెరపీ, పింఛన్ సౌకర్యం కల్పిస్తోందన్నారు. వీటిని లబ్ధిదారులు సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భవిత ఐఈఆర్‌పీలు సరిత, సత్యనారాయణమూర్తి, ఉపాధ్యాయులు రమేష్, రామారావు, తిరుపతి, శ్రీను, దివ్యాంగులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కావాల్సిన విత్తనాలు దొరకడం లేదు.

- వైస్ ఎంపీపీ ఈశ్వరరావు



మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న సభ్యులు

మెంటాడ: రైతుసేవా కేంద్రాల్లో 1121 రకం తప్ప రైతులకు కావాల్సిన విత్తనాలు దొరకడం లేదని వైస్ ఎంపీపీ ఈశ్వరరావు అన్నారు. ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు అధ్యక్షతన శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ.. రైతుల సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. మంత్రి సంధ్యారాణి ఈ నెల 3న ఇద్దనవలసలో విత్తనాల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతూ.. రెండు రోజుల్లో పచ్చిరొట్ట విత్తనాలు వస్తాయని చెప్పారని, కాని ఇంతవరకు రాలేదని వైస్ ఎంపీపీ అన్నారు. ఇద్దనవలస సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాయిపల్లి రామారావు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ వర్కర్లకు తల్లికివందనం నగదు పడలేదన్నారు. ఇద్దరు, ముగ్గురు పిల్లలున్న వారిలో కూడా ఒకరికే నగదు జమైందని చెప్పారు. అలాగే పీహెచ్‌సీలు, పశువుల ఆస్పత్రుల్లో మందుల కొరత ఉందన్నారు. రైతులకు పశుదాణా కూడా సక్రమంగా పంపిణీ చేయలేకపోతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఏ.భానుమూర్తి, తహసీల్దార్ అరుణకుమారి, వైస్ ఎంపీపీ దుర్గ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల శాఖ అధికారులు పాల్గొన్నారు.

నిధులు ఇప్పుడిస్తే పనులెప్పుడు చేయాలి..?

- మడ్డువలస అధికారులను నిలదీసిన నీటి సంఘాల ప్రెసిడెంట్లు



అధికారులను ప్రశ్నిస్తున్న టీసీ

రాజాం: కాలువల్లో పూడికలు తొలగింపునకు నిధులు ఇప్పుడు మంజూరు చేస్తే పనులు ఎప్పుడు చేయాలని పలువురు మడ్డువలస చానల్ నీటి సంఘాల ప్రెసిడెంట్లు ఆ చానల్ అధికారులను నిలదీశారు. వేసవి మొత్తం కాలయాపన చేసి, ఇప్పుడు కాలువల ద్వారా నీటిని విడిచిపెట్టాల్సిన సమయంలో పనులు చేయమనడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమావేశ మందిరంలో గొర్లె శ్రీరాములు నాయుడు మడ్డువలస ప్రాజెక్ట్ కుడికాలువ నీటి సంఘాల టీసీలతో పాటు చైర్మన్‌లతో అధికారులు సమన్వయ సమావేశం నిర్వహించారు. చైర్మన్ రామినాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మడ్డువలస డీఈఈలు ఈశ్వరచంద్ర, నాగేశ్వరరావు, అర్జున్ మాట్లాడుతూ.. మడ్డువలస కాలువలో పూడికల తొలగింపు నిమిత్తం ఓఅండ్ఎం విభాగం ద్వారా రూ. 1.17 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. మడ్డువలస కుడికాలువ పరిధిలో మొత్తం 17 నీటి సంఘాలున్నాయని.. ఈ సంఘాల టీసీలు బ్యాంక్ ఖాతాలు జమచేసి, తమకు వివరాలు ఇవ్వాలని, తమ పరిధిలోని కాలువలో పనులు పూర్తిచేసే బాధ్యత టీసీలదేనని సూచించారు. ఈ సందర్భంలో పలువురు టీసీలు అధికారుల తీరును ప్రశ్నించారు. ఇంతవరకూ ఎటువంటి సమాచారం లేదని, ఇప్పటికిప్పుడు పనులు ఎలా పూర్తి చేయగలమని నిలదీశారు. చేసిన పనులకు బిల్లులు సకాలంలో చెల్లిస్తారా అని ప్రశ్నించడంతో డీఈఈలు హామీ ఇవ్వడంతో పనులు చేసేందుకు సన్నద్ధమయ్యారు. కార్యక్రమంలో పలువురు టీసీలతో పాటు మడ్డువలస కాలువ ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

20 లక్షల ఉద్యోగాలు ఎక్కడ బాబూ..?

- ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు యుగంధర్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఏఐఎస్ఎఫ్ కార్యవర్గ సభ్యులు

బొబ్బిలి: తాము అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, ఉద్యోగాలు వచ్చేవరకూ నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి అందజేస్తామని, ప్రతి ఇంటికీ బాండ్‌లతో కూడిన హామీ ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడు ఆ మాటే మరిచిపోయారని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. యుగంధర్ అన్నారు. కూటమి పాలనలో హామీల విస్మరణపై ఏఐవైఎఫ్ కమిటీ సభ్యులు శుక్రవారం స్థానిక గంటి ప్రసాదం స్మారక భవనం వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల హామీలను అమలు చేయకపోవడం దారుణమన్నారు. నిరుద్యోగ భృతి ఇవ్వకుండా, ఉద్యోగాలు తీయకుండా యువతను దగా చేశారని మండిపడ్డారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ద్వారా నిర్వహించిన సర్వే ప్రకారం 26 జిల్లాల్లో 2.67 కోట్ల మంది వివరాలు సేకరిస్తే అందులో ఉపాధి లేనివారి సంఖ్య కోటిన్నర పైనే ఉందన్నారు. నిరుద్యోగులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కోట అప్పన్న, డివిజన్ కార్యదర్శి వి. శ్రావణ్, కమిటీ నాయకులు పి. చిన్నమ్మి, ఆర్. శేఖర్, బి. మురళి పాల్గొన్నారు.

రా.ర.వే సమావేశం రేపు

రాజాం సిటీ: ఈ నెల 22న స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక 125వ సమావేశం నిర్వహించనున్నట్లు వేదిక కన్వీనర్ పిల్లా తిరుపతిరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ ఆల్తి మోహనరావు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో 'శ్రీపతి కథలు – ఒక పరిశీలన' అనే అంశంపై వర్ధమాన కళింగాంధ్ర సాహిత్య విమర్శకులు రాజాపు శాంతారావు ప్రసంగించనున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు, భాషాభిమానులు పాల్గొనాలని కోరారు.